# కామెడీ కథ

డా.కొఠారి వాణీ చలపతిరావు

# రఫ్ అండ్ టఫ్ రాంబాబు

'లైఫను లైట్‌గా తీసుకుని.. రఫ్ అండ్ టఫ్‌గా బతికేయాలి...' ఇది రాంబాబు ఉవాచ. ఎప్పుడూ అతని నాలుక కొసన ఈ మాటలే ఉంటాయి ఊతపదాల్లా. అడిగినవారికీ అడగని వారికీ సందర్భానికి తగినా తగకపోయినా జీవన వేదాంతాన్ని ఎల్లవేళలా ఇలా ప్రబోధిస్తూనే ఉంటాడు. కష్టపడి బతికేవాళ్లన్నా, ఈ సమస్యలు... ఆ ఇబ్బందులు అంటూ జీవితాన్ని సీరియస్‌గా తీసుకుని ఎప్పుడూ ఏడుస్తూ ఇతరులను ఏడిపిస్తూ బతికేవాళ్లన్నా అతగానికి మహా చెడ్డకోపం. పట్టించుకుంటే అన్నీ బాధలే..! ఏవీ పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్టుగా, దున్నపోతు మీద వానపడ్డట్టుగా ఉంటే ఏ గొడవా ఉండదు- అన్నది రాంబాబు తరచూ చెప్పే జీవనసూక్తి. ఇలాంటి సూక్తులు, సుభాషితాలు అతని మాటల పొదిలో బోలెడు అడ్డదిడ్డంగా పడి ఉంటాయి. ఎప్పుడు ఏది అవసరం అనిపిస్తే దాన్ని తీసి సమయానికి దొరికినవాడి మీద ప్రయోగిస్తూ ఉంటాడు. "ఆయనెవరు.. ఆ సినిమా కవి... ఆత్రేయనో ఆరుద్రనో ఏమన్నాడు 'మనసున్న మనిషికి సుఖము లేదంతే' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పలేదూ. నాదీ అదే దారి.. నేనూ మనిషిననే తప్ప.. నాకొక మనసున్నదన్న విషయాన్నే మర్చిపోతాను నేను... ఒక్కోసారి 'అసలు ఉంటేగా మర్చిపోవటానికి' అని కూడా అనిపిస్తూ ఉంటుంది" మచ్చుకు ఇది ఒక ప్రయోగం.

రాంబాబు ఏ పని చేసినా అందులో శ్రద్ధ, ఆసక్తి, ఓపిక, ఎదుటివాళ్లు తనను చూస్తున్నారన్న ఆలోచన ఇవేవీ ఉండవు. అంతా 'రఫ్ అండ్ టఫ్' వ్యవహారమే. ఆహార్యమూ అంతే! ఇస్త్రీ లేక మడతలు పడిన ప్యాంటు పాదాల మీదుగా అంచుల నుంచి వేళ్లాడే దారాలున్న పాత ప్యాంటు, సమయానికి బెల్టు దొరక్కపోతే నడుము దగ్గర మాటిమాటికీ కిందకు జారిపోయే ప్యాంటు ఏదయినా చల్తా.. ఇక షర్ట్ అయితే పొట్టి చేతులదయినా, కాలర్ మీద మకిలపట్టిందయినా, గుండీలు సగమో, పూర్తిగానో పగిలినవయినా నిరభ్యంతరంగా తొడిగేసుకుంటాడు. ఎవరయినా గమనించినా గమ్మనుంటారు గానీ వచ్చి ముఖాన అతన్ని అడగరు కదా... నిర్మొహమాటస్తులు ఎవరయినా అడిగినా నిలబెట్టి నిలువెల్లా గుచ్చేయటానికి రాంబాబు మాటలపొదిలో వేదాంతం, వైరాగ్యం, సైకాలజీ వంటి తూణీరాలు అనేకం ఉంటాయి. అందుకే ఆ విషయం తెలిసిన వాళ్లెవ్వరూ సామాన్యంగా రాంబాబు జోలికి రారు.

ఇక అతగాడి హావభావాలు, బాడీ లాంగ్వేజ్, బిహేవియర్ వీటిలో కనిపించే రఫ్‌నెస్‌ను చెప్పాలంటే అదో పెద్ద కథే అవుతుంది.

"హల్లో...ప్రసాదూ.. ఏం చేస్తున్నావ్" అంటూ ఎకౌంట్స్ సెక్షన్‌కు వచ్చి సూపరింటెండెంట్ టేబుల్ ముందున్న చెక్క కుర్చీని 'బర్రు'న శబ్దం వచ్చేలా లాగి.. అందులో స్ట్రయిట్‌గా కాకుండా ఓ పక్కకు తిరిగి కూర్చున్నాడు రాంబాబు.. చేరగిలబడి.. భుజం కిందికి వాల్చి..!

బర్రుమన్న ఆ పెద్ద శబ్దానికి సీరియస్‌గా పని చేసుకుంటున్న ఆ సెక్షన్‌లోని ఉద్యోగులంతా చటుక్కున తలెత్తి చూసి ముఖాలు చిట్లించుకున్నారు. చేస్తున్న లెక్క తప్పినందుకు మళ్లీ మొదటికొస్తూ మనసులోనే విసుక్కున్నాడు ఎకౌంటెంట్.

"ఏమోయ్ ప్రసాదూ.. జీతం ఎప్పుడొస్తోంది ఈ నెల! ఎరియర్స్ గట్రా ఏమీ లేవా ఎగస్ట్రాగా వచ్చేవి!" అన్నాడు.

'ఈయనకెప్పుడూ జీతం ధ్యాసే. ఆఫీసులో పెన్ను పట్టుకొని పనిచేసేది మాత్రం లేదు. ఆ సీటు దగ్గరికి... ఈ సీటు దగ్గరికి వెళ్లి పనిచేస్తున్నవాళ్లను డిస్టర్బ్ చేయడం ఒక్కటే ఈయన చేసే పని' అని లోలోపలే విసుక్కుని... పైకి మాత్రం "జీతం వస్తుంది. ఫస్ట్ ఇంకా రెండు రోజులుందిగా . అప్పుడే తొందరపడితే ఎలా? నో ఎరియర్స్! ఈ రోజు పనేమీ లేదేంటి. చాలా ఫ్రీగా తిరుగుతున్నారు" అన్నాడు కావాలనే.

"పనిదేముంది రొటీన్.. అదే అవుతుంది. అటొచ్చి కొంచెం... ఇటొచ్చి కొంచెం చేస్తే పోయేదానికి.. బల్లలకు, కుర్చీలకు అంటుకుపోయి.. వంచిన తల ఎత్తకుండా పనిచేయాలా! ఐ డోంట్ లైక్ ఇట్! దేన్నయినా సీరియస్‌గా తీసుకోవటం నాకు అలవాటు లేదు. నా ఆరోగ్య రహస్యం అదే! ఆ! ఏంటి.. ఓ కప్పు చాయ్ కూడా తాగించే మూడ్‌లో కూడా కనిపించడం లేదు. నువ్వు ఇవ్వాళ?" అనగానే తప్పనిసరి పరిస్థితిలో బెల్ కొట్టి ప్యూన్‌ను పిలిచి రెండు 'టీ'లకు ఆర్డర్ ఇచ్చాడు ప్రసాద్.

'టీ' రాగానే కుర్చీలో సరిగా.. నిటారుగా కూర్చుని కప్పులోని 'టీ'ని సాసర్‌లో పోసుకుని 'ఉఫ్'మని ఊదుకుంటూ నోటీతో శబ్దాలు చేస్తూ తాగటం మొదలుపెట్టాడు రాంబాబు. అది చూసి చిరాకు పట్టింది ప్రసాద్‌కు. తన సబార్డినేట్స్ పని మానేసి తలలెత్తి తమ వంకే చూడటం చూసి మరింత చిరాకు పడిపోయాడు.

"అందుకే... ఈయన వచ్చినప్పుడు ఛాయ్ తెప్పించను నేను! అయినా అడిగి మరీ తాగుతాడు... కాదు గతుకుతాడు" అని గొణుక్కున్నాడు.

ఒక్కొక్క సిప్‌గా కప్పుతో టీ తాగుతున్న తనను ఉద్దేశించి "టీ ఎంజాయ్ చేస్తూ తాగాలి ప్రసాదూ... ఆముదం తాగుతున్నట్టు అయిష్టంగా ఒక్కొక్క చుక్కా తాగటం ఏమిటి. సాసర్ లేందే 'టీ' తాగబుద్ధి కాదు... కంప్లీట్‌గా దాని రుచిని ఆస్వాదిస్తూ తాగుతాను నేను" అంటూ పెద్ద ఘనకార్యం చేసినట్టు ఫోజు కొట్టాడు. తను ఏ పనిని ఎలా చేసినా అదే కరెక్ట్ అన్న అర్థం వచ్చేలా మాట్లాడతాడు రాంబాబు. ఎదుటి వాళ్లను 'మీకేం తెలియదు..మీకేం రాదు' అన్నట్టు తీసిపడేస్తాడు. 'మొహమాటం' అన్నది రాంబాబు డిక్షనరీలో లేని పదం.

"ఓ.కే! వస్తాను" అంటూ లేచాడు టీ కప్పు

టేబుల్ మీద పెడుతూ.

'నీకు పుణ్యం ఉంటుంది. వస్తాను అనకు బాబూ... వెళ్తాను అను' అని మనసులోనే అనుకున్నాడు ప్రసాద్.

వెళదామని లేచిన వాడు సీదా గుమ్మం వైపు వెళ్లకుండా "ఓసారి రామారావుని పలకరించి వెళతాను.." అంటూ యూ.డీ.సీ టేబుల్ దగ్గరకు వెళ్లి 'కూర్చోండి సార్' అని అతను కుర్చీ చూపించినా కూర్చోకుండా "జస్ట్.. పలకరించి వెళదామని వచ్చాను. ఈ కాసేపటి కోసం కుర్చీ ఎందుకు... అయినా నీ దగ్గర నాకు ఫార్మాలిటీస్ ఏమిటోయ్?" అంటూ అతని టేబుల్ మీదే ఓ కొసకు ఆనుకుని కూర్చున్నాడు రాంబాబు. దాంతో ఎవరన్నా చూస్తే బాగుండదన్న ఖంగారు పుట్టి... "అయ్యో అలా వద్దు సార్. బాగుండదు. కుర్చీలో కూర్చోండి!" అన్నాడు.



"ఎక్కడ కూర్చుంటే ఏముందయ్యా. క్యాజువల్గా ఉండాలి గానీ ప్రతి చిన్న విషయంలో కూడా అలా పర్టిక్యులర్గా ఉండడం నాకు నచ్చదు. ఐ లైక్ సింప్లిసిటీ. ఎదుటివాళ్లా అలాగే ఉండటం నాకిష్టం" అన్నాడు టాటా, బిర్లాల స్టయిల్లో.

ఆ మాటలు విన్న ప్రసాద్... 'నా బొంద సింప్లిసిటీ! బల్లల మీద ఎక్కి కూర్చుని కుర్చీల్లో కాగితాలు పెట్టుకుని రాయడం, గ్లాసుల్లో ఘనపదార్థం తిని, కంచాల్లో ద్రవపదార్థం తాగటం వంటి అలవాట్లను సింప్లిసిటీ అనరు తిక్క వేషాలు అంటారు' అనుకున్నాడు మనసులోనే.

తనకు పనీపాటా ఇష్టం లేదు గనుక, ఎదుటి వాళ్ల పని చెడగొట్టడమే పనిగా రోజుకు ఒకసారో, రెండుసార్లో సెక్షన్కు వచ్చి సొల్లువాగుడు వాగి, బఫూన్ వేషంతో వింత చేష్టలతో తిరిగే రాంబాబు అంటే అందరికీ చులకన భావమే ఉంది ఆ ఆఫీసులో.


* * *

రాంబాబు భార్య రంగనాయకి చాలా పద్ధతయిన మనిషి. ఏ పని చేసినా చాలా ఓపికగా, శ్రద్ధగా చేసి అందరి మెప్పునూ పొందుతుంటుంది. రాంబాబు మాత్రం 'నీకు మరీ చాదస్తం.. అతి శుభ్రం! రఫ్ అండ్ టఫ్గా ఉండాలి మనిషంటే. అందులోనే సింప్లిసిటీ ఉంటుంది. ఆనందం ఉంటుంది. దేన్నయినా 'డోంట్ కేర్..' అన్నట్టు ఉండాలి అంటూ భార్యకు జీవిత పాఠాలు బోధిస్తూ ఉంటాడు.

భార్యాభర్తలిద్దరూ... ఒకే మాటగా, ఒకే బాటగా, ఒకే జీవన విధానంగా.. రైలు పట్టాల్లా సమాంతరంగా కలిసి నడిస్తే ఆ జీవితం సుఖంగా, సంతోషంగా, నిశ్చింతగా హాయిగా సాగిపోతుంది. కానీ రాంబాబు, రంగనాయకిల కాపురంలా భిన్న అభిప్రాయాలు భిన్న అభిరుచులు, అలవాట్లతో వంకరటింకరా... ఎవరి దారి వారిదిగా సాగితే అది అనేక అసంతృప్తులకు, చికాకులకు దారితీస్తుంది. పెళ్లయిన కొత్తలో రాంబాబు వాలకం, వాచికం, చేసే పనులు చూసి దంగయింది రంగనాయకి. ఎర్రగా, బుర్రగా, చూపులకు వడ్డూపొడుగూ లావుగా

ఉండటం చూసి పెళ్లిచూపుల రోజు "పిల్లవాడు బాగానే ఉన్నాడు" అని అందరూ అనుకున్నారు.. తనూ అనుకుంది. కొడుకు సంగతి తెలిసిన మావ గారు.. "వచ్చిన ప్రతి సంబంధమూ తప్పిపోవటం" అనే ప్రమాదం నుంచి కొడుకును రక్షించి, పెళ్లి జరిపించటం కోసం... తిర్నాలకెళ్లే ప్రభబండికి కట్టే ఎద్దులను అలంకరించినట్లు... ఆ కాసేపూ ఇస్త్రీ ప్యాంటు, షర్టు, కళ్లద్దాలు, రిస్ట్ వాచీ, బాటా షూస్‌తో మగమహారాజు గెటప్‌లో అలంకరించి తీసుకొచ్చారని ఆ తర్వాత తెలిసింది రంగనాయకికి.

డైనింగ్ టేబుల్ ఉండగా అది వదిలిపెట్టి కింద నేల మీద కూర్చుని.. కంచం వళ్లో పెట్టుకుని భోజనం చేయటం. సోఫా మీద కాళ్లు పెట్టుకుని కింద చాప మీద దిండేసుకుని పడుకోవటం. పైజామా బొందులు మోకాలుదాకా వేళ్లాడుతుండగా.. అలాగే ఇల్లంతా తిరగటం వంటి పనులన్నీ చిరాకు కలిగించేవి. కోడలి మనసును కనిపెట్టిన మామగారు ఓ రోజు 'వాడేమిటోనమ్మా.. చిన్నప్పటి నుంచీ అలాగే తయారయ్యాడు. చాలా రఫ్ మనిషి. ఏదయినా ఒక పది వాక్యాలు చూసిరాత రాయటానికి.. రాసీ, తుడిపీ..రాసీ, తుడిపీ కాగితాలన్నీ ఖరాబు చేయటమే కాక చేతులన్నీ ఇంకు మరకలతో ఖరాబు చేసుకునే వాడు. ఇంకు కక్కుతున్న పెన్నును అలాగే జేబులో పెట్టుకుని ఇంకు మరకలంటిన తెల్లచొక్కాతో అలాగే తిరిగేవాడు. 'అదేంటిరా?' అంటే.. 'ఏమవుతుంది?' అనేవాడు. 'రఫ్‌గా రాసిందాన్ని మళ్లీ ఫెయిర్ చెయ్యరా...' అంటే అలా ఉండనీ. ఎలా రాసినా మ్యాటర్ అదేగా అనేవాడు.




చిన్నప్పటి నుంచీ వాడి నిర్లక్ష్యం, బద్ధకం, సీరియస్‌నెస్ ఏ పనిలోనూ లేకపోవడం విసిగించేవి. చెప్పీ.. చెప్పీ.. వినకపోయేసరికి వదిలేశాను. కాస్త నువ్వయినా చెప్పి.. వాడ్ని మార్చమ్మా" అనేవారు. ఇరవై ఎనిమిదేళ్ల నుంచీ. ఆ మనసు మీద పేరుకుపోయిన ఆ నిర్లక్ష్యం, బద్ధకం అంత త్వరగా వదిలేది కాదని.. అనుభవపూర్వకంగా తనకూ తెలిసి వచ్చింది రంగనాయకికి. రాంబాబుకు అన్నం.. కంచంలో పెట్టాక.. ఎదురుగా నిల్చునో, కూర్చునో వడ్డన చేయడం చాలా భరించలేని విషయంగా పెళ్లయి కాపురానికొచ్చిన కొత్తలోనే తెలిసింది రంగనాయకికి. ఇక అతనితో కలిసి సరదాగా భోజనం చేయడం అన్నది ఆమెకు ఈ జీవితంలో నెరవేరని కోరికగానే మిగిలిపోయింది. చనువుగా మామగారితో ఈ విషయాన్ని షేర్ చేసుకుంటే "మీ అత్తగారు ఉన్నప్పుడూ ఇంతేనమ్మా.. భరించలేకపోయేది. అన్నం వడ్డించి కూర, పప్పు, పెరుగు గిన్నెలన్నీ కంచం చుట్టూ పెట్టి 'నువ్వే వడ్డించుకుని తినరా. నాకు అవతల పనుంది' అని ఇవతల వచ్చి కూర్చునేది" అన్నారు.

భర్త భోజన కార్యక్రమాన్ని మనసులోనే పిక్చరైజ్ చేసుకుని కళ్ల ముందు నిలుపుకుని చూస్తూ ఉంటే కడుపు దేవినట్టయింది రంగనాయకికి. రాంబాబు భోజనప్రియుడు. తన ఆ ప్రియత్వాన్ని కంచం ముందు కూర్చుంది మొదలూ ఇతరుల కళ్ల ముందు ప్రదర్శించేస్తాడు. పెద్ద పెద్ద కబళాల అన్నానికి.. అరచేతికి అబ్బినంత పప్పుదప్పళాన్ని చేర్చి అందులో ఎర్రటి ఆవకాయ కారాన్ని జత చేసి.. పెద్ద గిన్నెడు నెయ్యి ధారగా ఎత్తిపోసుకుని మునివేళ్లతో సుతారంగా కాక రుబ్బురోలులో పొత్రాన్ని వేసి రుబ్బినట్టు అరచెయ్యి మొత్తంతో పిసికీ పిసికీ కలిపి పెద్ద వెలగకాయను ఏనుగు తొండంతో అమాంతం నోట్లో వేసుకున్నట్టు నోరంతా తెరిచి ముద్దను నోట్లో పడేస్తాడు రాంబాబు. ఆ తర్వాత నాకుడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ అరచేతి కున్నదాన్ని ఐదు వేళ్లకూ అంటిన దాన్ని కొంచెం కూడా వదిలిపెట్టకుండా నాకేస్తాడు. ఇక పెరుగన్నంలోకి వచ్చాడంటే ఆ చుట్టుపక్కల ఉన్నవాళ్లే కాదు ఇరుగింటివాళ్లు పొరుగింటి వాళ్లు కూడా దడుసుకుని ఆమడదూరం పారి



## ఇల్లు ఇల్లే!

కత్రినా కైఫ్ దాదాపు మూణ్ణెల్లుగా తన ఇంటికే వెళ్లలేదుట. దాంతో హోమ్‌సిక్‌గా అనిపిస్తోంది అంటోంది కత్రినా. ఊటీలో నెలకి పైగా షూటింగ్‌తో బిజీగా వున్న కత్రినా ఆ తర్వాత అట్నుంచి అటే అమెరికా కి మరో హిందీ సినిమా షూటింగ్‌కి వెళ్లిపోయింది. అక్కడ కూడా నెలకి పైగానే షూటింగ్‌లో పాల్గొనడంతో ఇంటి మీద ధ్యాస మళ్లిందిట. అందుకనే తన చెల్లెలు ఇసబెల్లెని తన దగ్గరకి రప్పించుకుని కాస్తంత ఊరట పొందిందిట. ఎంత గ్లామర్, సంపాదన వున్నా ఇల్లు ఇల్లే కదా!




పోవలసిందే.

జుర్రుకునే శబ్దాలు... హైపిచ్‌లో శ్రోతల చెవులలో శూలాలు గుచ్చినట్టయి... తమకు చెవుడు లేనందుకు రెండు చెవులూ మూసుకుని లబలబా మొత్తుకు నేలా చేస్తాయి. ఆ తరువాత వేళ్లు నాకే దృశ్యాన్ని చూసిన కళ్లు కుమిలి కుమిలి ఏడ్చేలా చేస్తాయి. పెళ్లయిన కొత్తలో నయితే 'ఇదెక్కడి మొగుడురా బాబోయ్! జీవితాంతం ఎలా ఈయన్ని భరించడం' అని రంగనాయకి తల పట్టుకోని రోజు లేదు.

"మీకు కావాలంటే మరి కొంచెం అన్నం పెట్టి మరో గిన్నెడు పెరుగు వేస్తాను దయచేసి ఆ ఐదువేళ్లను వాటి మానాన వాటిని వదిలేయండి" అంది ఓ రోజు.

"నువ్వు ఎన్నిసార్లు అన్నంపెట్టి ఎంత పెరుగు వేసినా ఇలా వేళ్లు నాకకుండా మాత్రం ఉండను నేను. అదో రుచి! నువ్వూ నాకి చూస్తే తెలుస్తుంది. ఎంత కమ్మగా ఉంటుందో" అన్నాడు. ఆ మాటలతో వళ్లు మండింది రంగనాయకకి.

"నాజూకుతనం, సున్నితత్వం అనేవే ఉండవా మీరు చేసే పనుల్లో. ఎంతసేపూ మీరు తినే తిండి మీరు చెయ్యదలుచుకున్న రీతిలో పని ఇవే తప్ప ఎదుటివాళ్ల గురించి పట్టించుకోరా మీరు. మరొకరితో ఉన్నప్పుడు ఓ పద్ధతి, ప్రవర్తనా నియమాలు అనేవి కొన్ని ఉంటాయి" అని చెప్పింది. అలా చెప్పిన నాలుగు రోజులకే అనుకోకుండా ఓ శుభకార్యానికి వెళ్లాల్సి వచ్చింది. భోజనాల సమయంలో బంతిన ఎదురుగా మగవాళ్ల వరసలో మధ్యగా కూర్చున్న భర్తను చూసి బితుకుబితుకు మంది రంగనాయకి హృదయం. భయపడినట్టుగానే బకాసురుడి లెవల్లో భోజనం చేస్తున్న తన భర్తను చూసి పక్కనున్న వాళ్లు ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి, చూడటం ముఖాలు, నొసలు చిట్లించడం చూసి సిగ్గుతో చితికిపోయింది రంగనాయకి. సైగ చేసి "అలా తినవద్దని" చెబుదామన్నా తలెత్తి చూస్తేనా మహానుభావుడు వంచిన తల ఎత్తకుండా 'తినటమే నా జీవిత ధ్యేయం' అన్నట్టు. అందులో మునిగిపోతుంటే ఎలా చెప్పటం? అందుకే సాధ్యం కాక ఊరుకుంది. అప్పటిదాకా ఆయన వికృత చేష్టలను, వింత వింత శబ్దాలను మర్యాద కోసం ఎలాగోలా భరించి ఆ తర్వాత రాంబాబు పెరుగన్నంలోకి వచ్చాక మాత్రం ఇక భరించలేక.. సగం భోజనంలో లేచి చెయ్యి కడుక్కున్నారు ఆ లైను లైనంతా! ఆ సంఘటన తర్వాత ఇక ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోక తప్పదు! లేకుంటే ఈ మనిషితో ఎక్కడికి వెళ్లాలన్నా, నాకో ప్రోబ్లమ్ అవుతుంది. ఇంట్లోనూ, బయటా ఇలా ఉండే మనిషి... ఇక ఆఫీసులో మాత్రం ఇలాగే ఉండదని గ్యారంటీ ఏమిటి? ఈయన వ్యక్తిగత విషయం ఇప్పటికి కుటుంబ సమస్యగా, ఇరుగుపొరుగుల, బంధువుల సమస్యగా తయారయింది.

ఇలా వదిలేస్తే ఇల్లాలినై ఉండే నేనూ పట్టించుకోకపోతే రేపు ఓ సమాజ సమస్యగా మారినా మారవచ్చు. పరువు ఆయనది పోయినా నాదీ పోయినట్టే. పది మంది ఆయన గురించి చెడుగా అనుకుంటే.. ఆయన ఉనికే వాళ్లకు భరించరానిది అయితే అది తనకు మాత్రం చిన్నతనం కాదా" అన్న ఆలోచన రాగానే భర్త బ్యాడ్ హ్యాబిట్స్‌ని మార్చటానికి కంకణం కట్టుకుంది రంగనాయకి. అది కట్టుకోగానే వరసగా ఆమెకు పతివ్రతానుతల్లుల కథలన్నీ గుర్తుకు వచ్చాయి. ఆ సంప్రదాయాన్ని నరనరాన జీర్ణించుకున్న నేను... నా భర్తను సంస్కరించడం కోసం ఏదో ఒకటి ఎందుకు చేయకూడదు...? ఆయన 'చేష్టలు' తనకిష్టం లేదుగానీ ఆయనంటే తన కిష్టమే.. మాంగల్య బంధం కదా మరి! చిన్నతనంలో తల్లిదండ్రుల కారణంగా, నో స్నేహితుల ప్రభావం వల్లనో, పుర్రెతో వచ్చిన బుద్ధి వల్లనో మొత్తానికి దేని వల్ల నయితేనేం... అన్ కల్చర్డ్, అన్‌బేరబుల్ లక్షణాలు ఆయనకు అబ్బాయి... వాటిని ఆయన నుంచి తొలగించి మంచీ, మర్యాదా నేర్పించటం... అయితే తన వల్లనే కావాలి గానీ మరొకరి వల్ల ఎలా అవుతుంది. తన మనిషిని తను పట్టించుకోక పోతే మరెవరో ఎందుకు పట్టించుకుంటారు?" అన్న ఆలోచన రాగానే నడుం బిగించి రంగంలోకి దిగిపోయింది రంగనాయకి.

★ ★ ★



## అదీ సంగతి!

అనుష్క మొదట్లో ఎంతో రిజర్వుడ్‌గా వుంటూ, ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేది కాదట. కానీ యోగాతో పరిచయం కావడం తన జీవితంలో పెద్ద మలుపు అంటుంది అనుష్క. ఎప్పుడైతే తను యోగా నేర్చుకోవడం మొదలుపెట్టిందో తనలో ఓ కొత్త ఉత్సాహం వచ్చి చేరిందంటుంది. దీని వల్ల తను నలుగురిలోనూ ఎంతో చురుకుగా, చలాకీగా తిరగాడే విధంగా తను మారగలిగానంటోంది అనుష్క.

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలన్నట్టు, ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు.. ఓ పద్ధతీ, పాడూ లేని రఫ్ అండ్ టఫ్ మనిషికి మందు. ఆ రఫ్ అండ్ టఫ్‌నెస్‌తోనే వెయ్యాలి మనిషి మనసు ఎంత విచిత్రమైందంటే కొన్ని చేయగూడని పనులను, చెడు అలవాట్లను తను చేస్తే తప్పు అనిపించదు. ఎబ్బెట్టుగా అనిపించదు గానీ అవే పనులను ఎదుటి వాళ్లు చేస్తే మాత్రం ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. తన అలవాట్లను తను మానుకోడు గానీ వాళ్లు మాత్రం మానుకోవాలి. ఈ విషయం రంగనాయకకి తెలిసిందే గనుక అదే బిహేవియర్ థెరపీ ఇచ్చి ఆ విధంగా ఆయనలో మార్పు తీసుకురావాలని నిర్ణయించుకుంది. మంచి మాటలకు, హితోపదేశాలకు లొంగే ఘటాలా ఇవి!" అనుకుని ఆయనకు ఇవ్వబోయే షాక్ ట్రీట్‌మెంట్‌కు ఓ ప్రణాళిక సిద్ధం చేసుకుంది.

ఆ రోజు ఉదయాన్నే పక్కమీద నుంచి లేస్తూ 'కాఫీ!' అని కేక పెట్టాడు రాంబాబు.

"కాఫీ రెడీ!" అంటూ రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి టీపాయ్ మీద పెట్టి... అతను వచ్చి సోఫాలో కూర్చోగానే.. తను కింద చతికిలబడి కూర్చుని కప్పులోని కాఫీ సాసర్‌లో పోసుకుని 'ఉఫ్..ఉఫ్..'మని ఊదుకుంటూ బర్రు..బర్రున శబ్దాలు చేస్తూ.. మధ్య..మధ్య "అబ్బ! కాఫీ బాగుంది.. ఇలా తాగుతుంటే నిజంగానే బాగుందండోయ్!" అంది రంగనాయకి.

అప్పటికే ఆశ్చర్యంతో కొయ్యబొమ్మలా కూర్చుండిపోయిన రాంబాబు ముఖంలో అప్పటికప్పుడు బోలెడు రంగులు మార్చాడు! డిఫరెంట్ డిఫరెంట్ హావభావాలు ప్రదర్శించాడు.. అచ్చం తెలుగు సినిమాల్లో బ్రహ్మానందంలాగే మగవాళ్లకెప్పుడూ ఆడవాళ్ల నెమ్మదితనం మీద, మంచితనం మీద, అమాయకత్వం మీద, ఎన్ని అన్నా.. ఎలా ప్రవర్తించినా పడి ఉండే సహనశీలత మీదా బోలెడు నమ్మకం. ఆ నమ్మకం వమ్మయితే మాత్రం ఆ వాస్తవాన్ని భరించలేరు... చూసి తట్టుకోలేరు. కాళ్లు బార్లా చాపి కూర్చున్న భార్యనుద్దేశించి "ఏంటలా కూర్చున్నావు అసహ్యంగా? ఏంటా కాఫీ తాగడం" అన్నాడు రాంబాబు ముఖం చిట్లించి. "మీరు ఇలాగే కూర్చుంటారుగా. "కాఫీ'ని మీరూ రోజూ ఇలాగే తాగుతారుగా. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారు" అంటారు... మిమ్మల్ని రోజూ ఇలా తాగడం చూసీచూసీ నాకూ ఇలా తాగాలనిపించింది. ఇలా తాగుతుంటే చాలా బాగుందండోయ్!" అంది హుషారుగా.



"ఇక నుంచి రోజూ ఇలాగే తాగుతావా?" ఆముదం తాగిన ముఖం పెడుతూ అడిగాడు రాంబాబు.

అవును! అన్నం కూడా అచ్చం మీలాగే లొట్టలేసుకుంటూ వేళ్లు నాక్కుంటూ తింటాను.

"ఇంటికెవరన్నా వస్తే ఏమనుకుంటారు?"

"మీరు అలా అడుగుతుంటే నాకో మంచి ఐడియా వచ్చింది. మనమూ ఈవినింగ్ రూమ్‌లో కాళ్లు జాపుకుని కింద ఎదురెదురుగా కూర్చుని ఇలా 'బుర్రుబుర్రు'మని కాఫీ తాగుదాం రోజూ! ఇంటికెవరన్నా వస్తే "ఆహా! ఏం జంట? ఏం అన్యోన్య కాపురం" అనుకుంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి పోతారు."

"ఛ!"

"మరో సూపర్ ఐడియా... కుట్లూడి దారాలు వేళ్లాడే ప్యాంటుపై బటన్ కిందికి, కింది బటన్ పైకి పెట్టుకున్న షర్ట్.. కాళ్లకు స్లిప్పర్స్ వేసుకుని 'మీరు' - చింపిరి జుట్టు, చిరిగిన చీర, వీపు మీద పొట్టయి పైకి పోయిన జాకెట్టు వేసుకుని, వ్యానిటీబాగ్ బదులు చందనబ్రదర్సు వారి గోనె సంచి పట్టుకుని 'నేను'... బయటకి షికారుకు, షాపింగ్‌కు వెళదాం ఈ రోజు సరదాగా.

"నోర్ముయ్.. పిచ్చివాగుడు వాగకు!"

పిచ్చివాగుడుతో, పిచ్చి వేషాలతో తప్ప అంత సీరియస్‌గా, అంత కోపంగా భర్తనెప్పుడూ చూడలేదేమో పిచ్చి ఆనందం కలుగుతోంది రంగనాయకికి.

రంగనాయకిలోని ఆ అకస్మాత్ పరిణామం. అచ్చం తనలా ప్రవర్తించడం చూసి "రోజూ నేను ఇంత అసహ్యంగా ప్రవర్తిస్తున్నానా.. ఎలా భరిస్తున్నారు జనం?" అని ఎన్నిసార్లో తనలో తాను అనుకున్నాడు.. రాంబాబు.

"ఇంకోసారి ఇలా ఛస్తే చేయకూడదు! డిగ్నిఫైడ్‌గా ఉండాలి అని అప్పటికప్పుడే డిసైడ్ అయిపోయాడు...!"

షాక్‌ట్రీట్‌మెంట్లు అలాగే ఉంటాయి మరి! గోలీలు, సూదులతో నెలలు, సంవత్సరాల వరకూ తగ్గని రోగాలు ఒక్కసారి చురుక్కుమని షాక్ ఇవ్వగానే తక్కున తగ్గిపోతాయి.

* * *

ఆ మర్నాడు నీట్‌గా ఇస్త్రీ బట్టలు వేసుకుని, షేవ్ చేసిన నున్నని గడ్డంతో, నిగనిగలాడే నల్లటి షూస్‌తో 'టై'తో ఆఫీసులో అడుగుపెట్టిన రాంబాబును చూసి కొలీగ్స్ అంతా ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారు. కొంత మంది అయితే గుర్తే పట్టలేదు. ఎకౌంట్స్ సెక్షన్‌కు వెళ్లి 'గుడ్‌మార్నింగ్ మిస్టర్ ప్రసాద్!' అనగానే ఆయనయితే పడిపోయాడు.

## అప్పుడే పెళ్లా?

సినీ పరిశ్రమలో దాదాపు ముప్పయ్యేళ్ల నుంచీ (బాలతార నుంచి హీరోయిన్ వరకూ) నటిస్తున్న మీనా ఇక పెళ్లి చేసుకుంటుంది అనే వార్తలు ఆమధ్య వినిపించాయి. కానీ తాజా సంగతేంటంటే- నేను మరో ఐదేళ్ల వరకూ పెళ్లి చేసుకోవాలనుకోవడం లేదు అంటోంది మీనా. ఇప్పటికే ముప్పయ్యొయిదేళ్ల టింగణాగా మారిన మీనా ఇంకా ఐదేళ్లు ఆగితే నలభైల్లోకి వెళుతుంది. ఇక అప్పుడేంటి పెళ్లి? అని ముక్కున వేలేసుకుంటున్నారు ఇది విన్నవాళ్లంతా.